
సాక్షి
కర్నూలు
సోమవారం, 10, ఏప్రిల్, 2023



హోరాహోరీగా..
సి.బెళగల్: క్రిష్ణదొడ్డి గ్రామంలో ఆదివారం అంతర్రాష్ట్ర ఎద్దుల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. కోన వేంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహించారు.



నల్లమల చిగురించే
రుద్రవరం: శిశిరంలో ఆకులు రాల్చిన చెట్లు వసంతంలో చిగురించాయి. దీంతో నల్లమల అడవికి కొత్త శోభ వచ్చింది. రుద్రవరం సమీపంలోనున్న కొండ పచ్చదనంతో కనువిందు చేస్తోంది.



కొనసాగుతున్న భక్తుల రద్దీ
శ్రీశైలంటెంపుల్: వరుస సెలవుల నేపథ్యంలో క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీతో శ్రీశైలక్షేత్ర పురవీధులు, ఆలయ క్యూలైన్లు ఆదివారం కిటకిటలాడాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:37	ఉ॥ 4:43
ఆదోని	సా॥ 6:40	ఉ॥ 4:46
నంద్యాల	సా॥ 6:36	ఉ॥ 4:40
ఆత్మకూరు	సా॥ 6:35	ఉ॥ 4:41
బనగానపల్లె	సా॥ 6:38	ఉ॥ 4:41

హదీస్ వెలుగు :
'రంజాన్ ఉపవాస దీక్ష మనిషిలోని అహంను తొలగించి, ఆధ్యాత్మికతను, మంచి నడవడికను నేర్పుతుంది. తప్పనిసరిగా ఉపవాసం ఉండి అల్లాహ్ అనుగ్రహం పొందండి.'
– పవిత్ర ఖురాన్

ఆ గళం.. వద్దు బాబోయ్!

- లోకేశ్ పాదయాత్రకు జనసేకరణ చేయలేమన్న టీడీపీ నేతలు
- ఖర్చు భరించలేమని చేతులెత్తేసిన వైనం
- యాత్ర ఫెయిల్ అవుతుందని పార్టీకి ముందస్తు సమాచారం
- దీంతో రంగంలోకి దిగిన టీడీపీ అధిష్టానం
- పూటకు రూ.500 చెల్లించి కూలీలను తరలించేలా వ్యూహం
- ఈ నెల 13న కర్నూలు జిల్లాలోకి చేరనున్న లోకేశ్ పాదయాత్ర

లోకేశ్ యువగళం పాదయాత్ర ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అట్టర్‌ఫ్లాప్ అయింది. 'అనంత'లో అదే పరిస్థితి. కర్నూలు జిల్లాలో టీడీపీది అత్యంత బలహీన స్థితి. ఇక్కడ 'యువగళం' ఫెయిల్ అవుతుందని అధిష్టానానికి ముందస్తు సమాచారం ఉంది. జిల్లా నేతల్లో కూడా ఉత్సాహం కనిపించడం లేదు. జన సమీకరణ చేయలేమని, ఖర్చు భరించలేమని చేతులెత్తేశారు. దీంతో అధిష్టానమే నేరుగా రంగంలోకి దిగింది. జన సమీకరణకు ప్రణాళిక రచించి, పార్టీనే ఖర్చు భరించేందుకు సిద్ధమైంది. దీనికి తగ్గట్లు కొందరి బాధ్యులను ఇప్పటికే కర్నూలుకు పంపి ఏర్పాట్లు చేస్తోంది. అయితే పార్టీ పరిస్థితి, నేతల తీరు చూస్తే కర్నూలు, నంద్యాల జిల్లాలలో యువగళానికి కష్టాలు తప్పేలా లేవు.
– సాక్షిప్రతినిధి కర్నూలు



నారా లోకేశ్‌ను ప్రజల్లోకి పంపితే కనీసం కొద్ది మేరకైనా నాయకత్వలక్షణాలు మెరుగుపడతాయనే లక్ష్యంతో టీడీపీ చేస్తోన్న కార్యక్రమం యువగళం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ముగిసి ప్రస్తుతం అనంతపురం జిల్లాలో సాగుతోంది. ఈ నెల 13న డోన్ నియోజకవర్గం ప్యాపిలిలో కర్నూలు జిల్లాలోకి ప్రవేశించనుంది. డోన్ తర్వాత పత్తికొండ నియోజకవర్గంలోకి ప్రవేశించి కర్నూలు జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు ముగించుకుని పాణ్యం నియోజకవర్గం ద్వారా నంద్యాల జిల్లాలోకి ప్రవేశిస్తుంది. నంద్యాల జిల్లాలో శ్రీశైలం, నందికొట్కూరు మినహా తక్కిన 5 నియోజకవర్గాల్లో సాగనుంది. ఆళ్లగడ్డ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కడప జిల్లాలోకి యాత్ర చేరుతుంది. అంటే ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాల్లో యాత్ర సాగనుంది. దాదాపు 40రోజుల పాటు యాత్ర సాగేలా రోడ్‌మ్యాప్ సిద్ధం చేశారు. అయితే యాత్రకు జనాలు వచ్చే పరిస్థితి లేదని టీడీపీ అధిష్టానం గ్రహించింది. దీంతో ముందస్తు చర్యలకు ఉపక్రమించింది.

రోజూ రెండు షిఫ్ట్‌లు... షిఫ్ట్‌కు ఒక్కో కూలికి రూ.500!

లోకేశ్ పాదయాత్రకు జనాలు రావడం లేదు. దీంతో సోషియల్ మీడియాలో యాత్ర 'అట్టర్‌ఫ్లాప్' అని వైరల్ చేస్తున్నారు. చివరకు యాత్రకు మద్దతు ఇచ్చే పత్రికల్లో కూడా రోజూ జనాలు ఉన్న ఫొటోలు ప్రచురించలేనిస్థితి! టీడీపీకి గట్టి నాయకత్వం ఉందని భావించే అనంతపురం జిల్లాలోని ఇలాంటి పరిస్థితి ఉంటే ఒక్క ఎమ్మెల్యే కూడా లేని కర్నూలు జిల్లాలో మరింత దారుణంగా పరిస్థితి ఉంటుందని పార్టీ గ్రహించింది. దీంతో యాత్రలో పాల్గొనేందుకు జనాలు సమీకరించేందుకు సిద్ధమైంది. రోజూ రెండు వేలమందికి తగ్గకుండా జనాలు సమీకరించే బాధ్యత ఇన్‌చార్జ్‌లకు అప్పగించింది. అంతమంది అంటే ఖర్చులు భరించలేమని ఇన్‌చార్జ్‌లు నిర్మొహమాటంగా చెప్పారు. దీంతో ఒక్కొక్కరికి రూ.500 చొప్పున కూలీ పార్టీ చెల్లించేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఎండలు ఎక్కువగా ఉండటంతో ఉదయం వచ్చినవారు సాయంత్రం వరకూ ఉండటం కష్టం. దీంతో రెండు షిఫ్ట్‌లుగా జనాలను తరలించనున్నారు. షిఫ్ట్‌కు వెయ్యిమంది చొప్పున రోజూ 2వేలమందికి జనసమీకరణకే రూ.10 లక్షలు ఖర్చు చేయనున్నారు. వీరితో పాటు లోకేశ్ భద్రతా, ఇతర సిబ్బంది మరో 500 మందిదాకా ఉన్నారు. వీరందరికీ భోజనాల ఖర్చు మాత్రం ఇన్‌చార్జ్‌లే భరించాలని చెప్పారు. వీరి కూలీ, వాహనాల అద్దె ఖర్చులు మాత్రం పార్టీ చెల్లిస్తుంది. ముఖ్యంగా ఆదోని డివిజన్ నుంచి వలసలు ఎక్కువగా ఉంటాయని, ఆ ప్రాంతం నుంచి కూలీలను తరలించడంపై దృష్టి సారించింది. దీంతో ఆయా గ్రామాల్లో టీడీపీ తరఫున వలంటీర్లు గ్రామాల్లో వెళ్లి ఆయా గ్రామాల్లో జనసమీకరణ చేయగలిగే వారిని కలుస్తున్నారు. ఈ నెల 13 లేదా 14 తేదీ నుంచి రోజూ తమకు ఎంతమంది అవసరం? కూలీ తదితర వివరాలు చెప్పి ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామస్థాయిలో జనాలను తరలించే వ్యక్తులకు రోజూ రూ.3వేలు చెల్లించాలి.

ఇప్పటికే ఒక విడత సమావేశం పూర్తి

యువగళం నేపథ్యంలో ఇప్పటికే టీడీపీ నేతలు అమర్‌నాథరెడ్డి, బీదా రవిచంద్ర జిల్లాలోని ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. రోడ్ మ్యాప్, ఇతర ఏర్పాట్లపై చర్చించారు. అయితే ఇన్‌చార్జ్‌ల నుంచి ఆశించినస్థాయిలో స్పందన కన్పించలేదు. దీంతో కర్నూలు పరిస్థితి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు వివరించినట్లు తెలుస్తోంది. చిత్తూరు జిల్లాలో జనసమీకరణపై అచ్చెన్నాయుడు ఆడియో రికార్డులు బయటకు రావడం, సోషియల్ మీడియాలో హల్‌చల్ చేసిన క్రమంలో కర్నూలు జిల్లాలో ఇలాంటి ఘటనలు బయటకు రాకుండా జాగ్రత్త పడాలని అచ్చెన్నాయుడు సూచించినట్లు తెలుస్తోంది.

జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీగా రఘువీర్‌రెడ్డి

- గ్రేడ్ ప్రమోషన్ శిక్షణకు వెళ్లిన సిద్దార్థ్ కౌశల్



కర్నూలు: ఆక్టోపస్‌కు బదిలీ అయిన సిద్దార్థ్ కౌశల్ జిల్లా ఎస్పీ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. హైదరబాదులోని ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీ (అప్పా) శిక్షణ కేంద్రంలో నెలరోజుల పాటు సిద్దార్థ్ కౌశల్ గ్రేడ్ ప్రమోషన్ శిక్షణ కోసం ఆహ్వానం అందింది. దీంతో కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్ సూచన మేరకు నంద్యాల ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించి ఆదివారం మధ్యాహ్నం సిద్దార్థ్ కౌశల్ హైదరాబాదుకు వెళ్లారు. సీనియర్ ఐపీఎస్ అధికారులు సెంట్రల్ సర్వీసుకు డిప్యూటేషన్‌పై వెళ్లే వెసులుబాటు ఉంటుంది. అలా వెళ్లాలంటే గ్రేడ్ ప్రమోషన్ శిక్షణ తప్పని సరి. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి నెలరోజుల పాటు హైదరాబాదులోని అప్పా కేంద్రంలో శిక్షణ కోసం సిద్దార్థ్ కౌశల్ వెళ్లారు. జిల్లా నూతన ఎస్పీ కృష్ణకాంత్ ఈ నెల 12వ తేదీన బాధ్యతలు చేపట్టనున్నారు. అప్పటి వరకు ఇన్‌చార్జ్ ఎస్పీగా రఘువీర్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఆదివారం ఉదయం క్షేత్ర స్థాయి పోలీసు అధికారులతో రఘువీర్‌రెడ్డి సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించి అందరిని అప్రమత్తం చేశారు.

పోలీస్ శాఖలో పరస్పర బదిలీలు

- మొత్తం 60 మందికి స్థాన చలనం

కర్నూలు: జిల్లా పోలీస్ శాఖలో పరస్పర బదిలీలు జరిగాయి. జిల్లా పునర్విభజన నేపథ్యంలో ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న బదిలీల ప్రక్రియను కర్నూలు, నంద్యాల జిల్లాల ఎస్పీలు సిద్దార్థ్ కౌశల్, రఘువీర్‌రెడ్డి పరిశీలించి ఆమోద ముద్ర వేశారు. ఇందులో భాగంగా కర్నూలు జిల్లా నుంచి నంద్యాల జిల్లాకు 30 మంది, అక్కడ పనిచేస్తున్న 30 మందిని కర్నూలు జిల్లాకు బదిలీ చేస్తు నోడల్ ఆఫీసర్ సురేష్‌బాబు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఇద్దరు ఏఎస్ఐలు, 14 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 10 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు, 34 మంది కానిస్టేబుళ్లకు స్థాన చలనం కల్పిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

న్యూస్‌రీల్

నేడు నూతన కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

- ఆదివారం రాత్రే కర్నూలు చేరుకున్న డాక్టర్ సృజన



డాక్టర్ సృజనకు స్వాగతం పలుకుతున్న జిల్లా అధికారులు

కర్నూలు(సెంట్రల్): జిల్లా కలెక్టర్‌గా నియమితులైన డాక్టర్ సృజన సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు. ఆదివారం సాయంత్రమే ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన పి.కోటేశ్వరరావు రిలీవ్ అయ్యారు. ఈక్రమంలో డాక్టర్ సృజన సోమవారం ఉదయం కలెక్టర్‌గా బాధ్యతలు చేపడతారు. అనంతరం స్పందనలో ప్రజల నుంచి వినతులు స్వీకరించే కార్యక్రమంలో మొదటగా పాల్గొంటారని తెలుస్తోంది. కాగా, ఆదివారం రాత్రే ఆమె కర్నూలు చేరుకున్నారు. ఆమెకు రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహం దగ్గర డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఆర్‌డీఓ సి.హరి ప్రసాద్‌తోపాటు పలువురు జిల్లా అధికారులు స్వాగతం పలికారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందనలో భాగంగా సోమవారం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఏప్రిల్ నెలకు సంబంధించి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పింఛన్ల పంపిణీ 3వ తేదీన మొదలై 8వ తేదీ అర్ధరాత్రితో ముగిసింది. పంపిణీలో రాష్ట్రంలో నంద్యాల జిల్లాకు 4వ స్థానం, కర్నూలు జిల్లాకు 5వ స్థానం లభించింది. కర్నూలు జిల్లాలో 2,38,448 మందికి గాను 2,36,682 మందికి, నంద్యాల జిల్లాలో 2,16,136 మందికి గాను 2,14,613 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. వార్డు, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, వలంటీర్లను డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య అభినందించారు. పింఛన్లు పంపిణీ చేయగా మిగిలిన నగదును వెంటనే ప్రభుత్వానికి జమ చేయాలని పీడీ ఆదేశించారు.

శిక్షణతో సాగుదాం

- వ్యవసాయ యంత్రాంగం, రైతులకు శిక్షణ
- భూసార పరీక్షలకు ఈసారి పెద్దపీట
- చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం
- సేంద్రియ వ్యవసాయంపై విస్తృత అవగాహన



భూసార పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ రైతులను సాగుకు సమాయత్తం చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మొదటి సారి వ్యవసాయ శాఖ ఖరీఫ్ ఆరంభానికి ముందు పలు ప్రధాన అంశాలపై ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు, మండల వ్యవసాయాధికారులతో పాటు రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, జిల్లా వనరుల కేంద్రం అధికారులు శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తోంది. మొదటి దశలో ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు, వ్యవసాయాధికారులకు, రెండవ దశలో రైతులకు శిక్షణకు ప్రణాళిక సిద్ధమైంది. భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయన ఎరువులు, సూక్ష్మపోషకాలు వినియోగించడం, ఏఏ నేలల్లో ఎలాంటి పంటలు వేసుకోవాలనే విషయమై అవగాహన కల్పించడం, మేలైన విత్తనాల ఎంపిక, రసాయన ఎరువులు-పురుగుమందుల వాడకం తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయాన్ని చేపట్టడం వల్ల కలిగే ఉపయోగాలను రైతుల్లోకి తీసుకెళ్లనున్నారు. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం, పంట మార్పిడి, సస్యరక్షణ పద్ధతులపై అవగాహన పెంచడం లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది.

రబీ వరకు భూములు ఖాళీగా ఉంచుకోకుండా..

జిల్లాలో నల్లరేగడి నేలలు అధికం. పలు మండలాల్లో ఖరీఫ్‌లో నల్లరేగడి నేలలను ఖాళీగా ఉంచుకొని రబీలో శనగ(బెంగాల్ గ్రామ్) వేస్తుంటారు. ఇందువల్ల ఒక పంటను రైతులు నష్టపోతున్నారు. ఖరీఫ్‌లో నల్ల రేగడి నేలలను ఖాళీగా ఉంచుకోకుండా స్వల్పకాలిక పంటలైన చిరుధాన్యాలు సాగు చేసుకోవచ్చు. ప్రధానంగా కొర్రలో అధిక దిగుబడినిచ్చే కొత్త రకాలను నంద్యాల ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు సిద్ధం చేశారు. తక్కువ పెట్టుబడి, రసాయన ఎరువుల అవసరం లేకుండా, వర్షాధారం కింద కొర్ర సాగు చేసి ఉత్పాదకతను పెంచుకోవచ్చు. ఇందువల్ల పంట మార్పిడి కూడా చేసినట్లు అవుతోంది.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి

రెండు, మూడు దశాబ్దాలుగా కెమికల్స్ వాడకం పెరుగుతుండటంతో ఆహార పంటల్లో వాటి అవశేషాలు అధికమయ్యాయి. ఫలితంగా అనేక రకాల జబ్బులు ప్రజలను పీడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి సారించింది.

సాగుకు రైతులను సమాయత్తం చేస్తున్నాం



ఖరీఫ్‌కు ముందే రైతులను సాగుకు సమాయం చేసే దిశగా చర్యలు చేపట్టాం. మొదటి దశలో ఈ నెల 6 నుంచి ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు, ఏఈఓలు, మండల వ్యవసాయాధికారులకు డివిజన్ స్థాయిలో శాస్త్రవేత్తలు, డీఆర్‌సీ అధికారుల ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నాం. రెండవ విడత ఈ నెల 18 నుంచి వచ్చే 22 వరకు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.
– పీఎల్ వరలక్ష్మి, డీఏఓ, కర్నూలు

భూసార పరీక్షలకు పెద్దపీట

వ్యవసాయ శాఖ ఈ సారి భూసార పరీక్షలకు పెద్దపీట వేస్తోంది. ఆదోని, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు, గూడూరుల్లో నియోజక వర్గాల వారీగా ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్‌లు.. కర్నూలు, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డుల్లోని భూసార పరీక్ష కేంద్రాలు ఈ మేరకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ల్యాబ్ ఏఓలందరికి భూసార పరీక్షల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపుతారు. ల్యాబ్‌ల్లో భూసార పరీక్షలు నిర్వహించి 24 గంటల్లో ఫలితాలను వెల్లడిస్తారు. పరీక్షల ప్రకారం రసాయన ఎరువులు, సూక్ష్మ పోషకాలు, సేంద్రియ ఎరువులు వినియోగించడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవచ్చు.

కరుణామయుడు యేసు



సందేశమిస్తున్న బిషప్ పుష్పలలిత

ఈస్టర్ పండుగను ఆదివారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసు మార్గంలో నడవాలని, సాటి మనుషుల పట్ల ప్రేమ, కరుణ చూపాలని మతపెద్దలు సందేశం ఇచ్చారు.
–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కర్నూలు సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

చిన్నారులకు టీకా రక్ష

- అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా వ్యాక్సిన్లు
- కొరత లేకుండా సరఫరా చేస్తున్న ప్రభుత్వం
- వందశాతం వ్యాక్సినేషన్‌కు ప్రతి ఏటా చర్యలు



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడేందుకు జిల్లాలో వ్యాక్సినేషన్ కార్యక్రమం పకడ్బందీగా సాగుతోంది. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి పెరిగి పెద్దయిన పిల్లల వరకు వారికి అవసరమైన టీకాలను ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తోంది. ధనుర్వాతం, క్షయ, కోరింత దగ్గు, పోలియో, హెపటైటిస్-బి, చికెన్ ఫాక్స్, గవదబిళ్లలు వంటి వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. గతంలో టీకా వేస్తున్నారని తెలిస్తే అప్పట్లో పిల్లలు పాఠశాలలకు వెళ్లేవారే కాదు. అవగాహన లేక తల్లులు కూడా పిల్లలకు టీకాలు వేయించేవారు కాదు. అపోహలు తొలగించడంలో అధికారులు, వైద్యసిబ్బంది సఫలం కావడంతో ఇప్పుడు ప్రతి ఒక్కరూ వారి పిల్లలకు టీకాలు వేయించడానికి ముందుకు వస్తున్నారు. దీంతో ప్రతి సంవత్సరం వంద శాతం టీకాకీరణ జరుగుతోంది.

ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ డే

జిల్లాలోని 25 మండలాల్లో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 300 దాకా ఉప ఆరోగ్యకేంద్రాలు, 20 దాకా పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ డే నిర్వహిస్తున్నారు. ఏఎన్ఎం/ఆరోగ్య కార్యకర్తలు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గర్భిణులు, చిన్నపిల్లలకు టీకాలు వేస్తున్నారు. ఈ మేరకు ప్రతి ఆరోగ్య కేంద్రానికి అవసరమైన టీకాలను జిల్లా ఇమ్యునైజేషన్ కేంద్రం నుంచి అధికారులు చేరవేస్తున్నారు. ఆయా కేంద్రాల్లో టీకాలు నిల్వ ఉంచేందుకు వీలుగా అవసరమైన ఫ్రిడ్జ్‌లు కూడా ఏర్పాటు చేశారు. ఈ మేరకు అప్పుడే పుట్టిన శిశువుల నుంచి పిల్లల వరకు, గర్భిణులకు గత నాలుగేళ్లుగా వందశాతానికి పైగా వ్యాక్సినేషన్ పూర్తి చేస్తున్నారు.

గత నాలుగేళ్లుగా వ్యాక్సినేషన్ ఇలా...

వ్యాక్సిన్	2019-20	2020-21	2021-22	2022-23
బీసీజీ	65,743	78,504	42,401	55,465
ఓపీవీ జీరో డోస్	63,752	78,504	42,401	49,864
హెపటైటిస్-బి జీరో డోసు	63,710	62,602	42,401	45,006
ఓపీవీ థర్డ్ డోసు	68,491	78,504	42,401	45,006
పెంటావాలెంట్ థర్డ్ డోస్	68,550	70,786	48,742	45,006
మీజిల్స్/ఎంఆర్	70,208	70,963	48,563	44,014
విటమిన్-ఎ మొదటి డోసు	67,199	70,161	47,237	44,014
పూర్తి టీకాలు తీసుకున్న ఏడాదిలోపు పిల్లలు	70,208	70,874	48,563	44,014
పూర్తి టీకాలు తీసుకున్న ఒకటి నుంచి ఐదేళ్లలోపు పిల్లలు	60,266	66,485	43,888	39,270

పిల్లలకు వేసే టీకాలు ఇలా...

- శిశువు జన్మించిన సమయంలో బీసీజీ, ఓపీవీ-జీరో మోతాదు, హెపటైటిస్-బి
- ఆరు వారాలకు ఓపీవీ-1, పెంటావాలెంట్-1, రోటా-1, ఎఫ్ఐపీవీ-1, పీసీవీ-1
- 10 వారాలకు ఓపీవీ-2, పెంటావాలెంట్-2, రోటా-2
- 14 వారాలకు ఓపీవీ-3, పెంటావాలెంట్-3, రోటా-3, ఎఫ్ఐపీవీ-2, పీసీవీ-2
- 9 నెలలకు మీజిల్స్-1/ఎంఆర్-1, విటమిన్-ఎ, జేఈ-1, పీసీవీ-బి -16నుంచి 24 నెలల్లో డీపీటీ మొదటి బూస్టర్ డోసు, ఓపీవీ బూస్టర్ డోసు, మీజిల్స్-2/ఎంఆర్-2, జేఈ-2
- 5 నుంచి ఆరు సంవత్సరాలకు డీపీటీ రెండవ బూస్టర్ మోతాదు
- 10, 16వ సంవత్సరంలో టీడీ వేస్తారు.

అందుబాటులో అన్నిరకాల వ్యాక్సిన్లు



అవసరమైన అన్ని రకాల వ్యాక్సిన్(టీకా)లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సిద్ధంగా ఉంచాం. ఏఎన్ఎంలు ప్రతి బుధ, శనివారాల్లో గ్రామాలకు వెళ్లి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతిరోజూ పిల్లలకు వ్యాక్సిన్ అందిస్తున్నారు. టీకాల కొరత లేకుండా ఎప్పటికప్పుడు ప్రభుత్వం పర్యవేక్షిస్తూ అందజేస్తోంది. ప్రతి సంవత్సరం చిన్నారులందరికీ టీకాలు వేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.
– డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, కర్నూలు

ఖరీదైన టీకాలు ఉచితంగా..



చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి. అతి ఖరీదైన నీమోకోకల్, పీసీవీ, ఐపీవీ, రోటావైరస్ లాంటి వ్యాక్సిన్‌లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. అయితే దగ్గు, జలుబు, జ్వరం ఉన్నప్పుడు టీకాలు వేయించకూడదు. అవి తగ్గిన తర్వాత వేయించవచ్చు. ఎందుకంటే ఇలాంటి సమయంలో టీకాలు వేయిస్తే ఇన్‌ఫెక్షన్ ఇంకా అధికమవుతుంది. వ్యాక్సిన్ పది నిమిషాల ముందు, పది నిమిషాల తర్వాత మాత్రమే బిడ్డకు తల్లి పాలివ్వాలి. –ఎం. మల్లికార్జున, అసోసియేట్ ప్రొఫెసర్, పీడియాట్రిక్స్, జీజీహెచ్, కర్నూలు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

బనగానపల్లెరూరల్: రాళ్లకొత్తూరు గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల వివరాల మేరకు.. అవుకు మండలం మెట్టుపల్లి గ్రామానికి చెందిన కృష్ణ, ఆయన సతీమణి లక్ష్మీతో పాటు సుమారు నాలుగేళ్ల వయస్సు ఉన్న కుమారుడు చిన్నారి మణిదీప్‌లు బైక్‌పై బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న బంధువును చూసేందుకు బయల్దేరారు. అయితే రాళ్లకొత్తూరు గ్రామ సమీపంలో అతివేగంగా ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ముగ్గురు కింద పడటంతో తీవ్రం గాయపడ్డారు. స్థానికులు వారిని బనగానపల్లె ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలుకు రెఫర్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామిరెడ్డి ఆసుపత్రికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేశారు.

పొట్టు లారీ దగ్ధం


మంటలతో దగ్ధమవుతున్న పొట్టు లారీ

కోవెలకుంట్ల: స్థానిక ఆళ్లగడ్డ ఆర్అండ్‌బీ రహదారిలో ఆదివారం ఓ పొట్టులారీ దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు.. సంజామల మండలం ముదిగేడు నుంచి మినీలారీ జొన్న పొట్టుతో ఆళ్లగడ్డవైపు బయలు దేరింది. కోవెలకుంట్ల మండలం కంపమల్ల మెట్ట సమీపంలో లారీ ఇంజిన్ నుంచి పొగలు రావడాన్ని గమనించి డ్రైవర్ వాహనాన్ని పక్కన ఆపి కిందకు దిగాడు. కొద్దిసేపటికే లారీ క్యాబిన్‌లో నుంచి మంటలు చెలరేగి పొట్టులోడుకు వ్యాపించాయి. దీంతో లారీ పూర్తిగా దగ్ధమైంది. డ్రైవర్ ఆళ్లగడ్డ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటినా సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. పొట్టుతోపాటు లారీ దగ్ధమైంది.

మద్యం మత్తులో భార్య, కుమారుడిపై దాడి

కోవెలకుంట్ల: స్థానిక సంతపేటలో ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఓ వ్యక్తి భార్య, కుమారుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. కాలనీకు చెందిన జంబులయ్య అతిగా మద్యం సేవించి భార్య పార్వతితో గొడవ పడ్డాడు. వాగ్వాదం తారాస్థాయికి చేరుకోగా పక్కనే ఉన్న కత్తితో భార్యపై దాడికి యత్నించగా కుమారుడు మహేష్ అడ్డుపడటంతో కత్తి పోటు పడింది. మరలా భార్యపై దాడి చేసి పరారయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం వారిని పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమికచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మహేష్‌ను నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

శుభగాత్రీ.. గిరిజాపుత్రి

- రేపు శ్రీశైల భ్రామరీకి కుంభోత్సవం
- నాడు చెంచుల ఉత్సవం.. నేడు అందరి వేడుక
- దక్షిణాచార సంప్రదాయంతో జంతు బలి నిషేధం
- స్వాతికబలిగా సమర్పించనున్న గుమ్మడి కాయలు, కొబ్బరి కాయలు
- కుంభోత్సవం రోజు అమ్మవారి మూలవిరాట్ దర్శనం

శ్రీశైలం: అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబాదేవికి మంగళవారం కుంభోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీశైల ఆలయ సంప్రదాయ ఆచారాల్లో భాగంగా స్థానిక చెంచులకు అతిముఖ్యమైన ఉత్సవం. ఆనవాయితీలో భాగంగా ఉగాది పండుగ అనంతరం మొదటి పౌర్ణమి తర్వాత వచ్చే మంగళ, శుక్ర వారాల్లో ఈ కుంభోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ మేరకు ఈనెల 11వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆ రోజు సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు శ్రీ భ్రమరాంబా ఆలయం మూసి వేసి, కాలపూజలు మాత్రమే నిర్వహిస్తారు. సాయంత్రం చంద్రోదయం అయిన తరువాత గుడి తెరిచి అమ్మవారిని కేవలం పసుపు కుంకుమలతో పూజిస్తారు. అమ్మవారి గర్భాలయం తెరచేటప్పటికే విగ్రహానికి ఎదురుగా ముఖ మండపంలోని శక్తియంత్రం వెనకాల వండిన అన్నం రాశిగా పోసి అన్నకూటోత్సవం నిర్వహిస్తారు. పూర్వం 1955 నుంచి దాదాపు 2000 సంవత్సరం వరకు అమ్మవారి ఆలయప్రాంగణంలో కోటగోడ అమ్మవారి వద్ద కోళ్లు, మేకలను కుంభోత్సవం రాత్రి బలిచ్చేవారు. కాలక్రమేణా సాత్విక బలిదిశకు ఈ కుంభోత్సవం చేరుకుంది. ప్రస్తుతం వేలకొద్ది నిమ్మకాయలు, గుమ్మడికాయలు, కొబ్బరికాయలు అమ్మవారికి సమర్పిస్తున్నారు. అటు దేవస్థానం వారితో పాటు స్థానికులు, వ్యాపారులు గ్రామం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ వందల కేజీల అన్నం, పెసరపప్పుతో కూడిన కుంభాన్ని అమ్మవారికి సమర్పిస్తారు. 6వ శతాబ్దంలో సాక్షాత్తూ ఆదిశంకరాచార్యులు వామాచార (బలుల) సంప్రదాయానికి స్వస్తి చెబుతూ దక్షిణాచార (సాత్వికబలి) సంప్రదాయాన్ని కొనసాగేలా అమ్మవారి ఉగ్ర రూపాన్ని ఉపసంహరించి శ్రీచక్రాన్ని ఏర్పాటు చేశారని ఆలయ చరిత్ర చెబుతోంది.

వడ్ల రామాపురం నుంచి కల్లు ముంత..

కుంభోత్సవంలో అమ్మవారికి ప్రత్యేక పూజల తర్వాత బోయ కులస్తులు ఘటం (కల్లుముంత) నైవేద్యంగా తెచ్చి పూజారులకు ఇవ్వగా, వారు గర్భాలయంలో దేవి ముందు ఉంచుతారు. ఈ విధంగా తరతరాలుగా ఆత్మకూరు మండలం వడ్లరామాపురంలోని ఒక బోయ కుటుంబానికి చెందిన వారు సంప్రదాయనుసారంగా ఘటం తెస్తున్నారు. దీంతో ఆ వ్యక్తిని ఘటం గురవయ్య అని నేటికి పిలుస్తారు.


అమ్మవారి మూలవిరాట్
(కుంభోత్సవం రోజు నిజరూపం ఇలా)

పూర్వం గిరిజనుల పండుగ



నేను 1969లో శ్రీశైల దేవస్థానంలో ఉద్యోగిగా చేరాను. అప్పట్లో కుంభోత్సవం చెంచు గిరిజనుల పండువగా నిర్వహించుకునేవారు. ఆలయ ప్రాంగణమంతా పరిసర గూడేల నుంచి వచ్చిన చెంచులతో నిండిపోయేది. వారు సంప్రదాయ రీతిలో నృత్యాలు చేస్తూ కోళ్లను, మేకలను బలి ఇచ్చే వారు. చాలాకాలం వరకు ఈ సంప్రదాయం కొనసాగింది. ఎంతో కనుల పండువగా ఈ కుంభోత్సవం జరిగేది. 2000 సంవత్సరం తర్వాత క్రమంగా ఆ సాంప్రదాయానికి తెరపడి, కుంభోత్సవం సాత్వికబలి దిశగా కొనసాగుతూ వస్తోంది.

– కరణం లక్ష్మీ నరసింహరావు, దేవస్థానం రిటైర్డ్ పర్యవేక్షకులు

పూర్వం ఇలా..

అమ్మవారి కుంభోత్సవాన్ని పూర్వం నల్లమల అటవీ ప్రాంత చెంచులు తమ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించేవారు. అమ్మవారి ఆలయంలో నిర్వహించే అన్నకూటోత్సవానికి చెంచులే అన్నం వండి తెచ్చేవారు. ఆలయంలోనే దున్నపోతును బలిచ్చి దాని తలనను అన్నపు రాశిపై భాగాన దేవి విగ్రహాన్ని చూస్తున్నట్లుగా ఉంచేవారు. అలాగే దున్నపోతు తలపై ఒక ప్రమిదలో నూనె పోసి దీపం సిద్ధం చేసేవారు. అక్కడే నాలుగు మేకపోతులను బలి ఇచ్చి అన్నపు రాశికి నాలుగు దిక్కులు సూచించేలా మేకల తలలను ఉంచేవారు. పాలుట్ల చెంచుగూడెం నుంచి అక్కడే నివసిస్తున్న ఒక వేశ్య కుటుంబానికి చెందిన స్త్రీ (ప్రస్తుతం ఈ కుటుంబం లేదు కానీ, పూర్వం ఇక్కడికి దగ్గరలో ఒక రాజ ఆస్థానం ఉండేదని, వారి పోషణలో వేశ్య కుటుంబం ఒకటి పాలుట్లలో ఉండేదని చెంచుల కథనం) రోజుంతా ఉపవాసం ఉండి ఒక ప్రమిదలో దీపం తీసుకొని బయలు దేరుతుంది. పాలుట్ల నుంచి శ్రీశైలం మార్గమధ్యలో ఉన్న ఏడు వాగులలో స్నానం చేస్తూ దీపంతో యువతి చెంచుల ఊరేగింపుగా భ్రమరాంబా ఆలయానికి రాగా.. ఆమె తెచ్చిన దీపంతో దున్నపోతు తలపై ఉన్న దీపాన్ని వెలిగిస్తుంది. చుట్టూ చేరిన చెంచులు తారస్థాయిలో డప్పులు వాయిస్తూ, నాట్యం చేస్తూ భక్తితో ఆనందోత్సాహాలతో అర్ధరాత్రి వరకు ఉత్సవాన్ని నిర్వహించేవారట.


ఏడాదిలో 364 రోజులు శ్రీభ్రమరాంబాదేవి దర్శనం ఇలా...

ఇప్పుడు ఇలా..



ప్రస్తుతం చెంచుల ప్రాధాన్యత తగ్గి కుంభోత్సవం అందరి వేడుకగా మారింది. పాలుట్ల నుంచి దీపం తీసుకొచ్చే వేశ్య యువతికి బదులుగా స్వామివార్ల ఆలయంలో పని చేసే పురుషుడొకరు స్త్రీ వేషంలో దీపంతో అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు. అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు భ్రమరాంబా దేవి గర్భాలయ తలుపులను తెరచి కుంభహారతిని ఆడవేషం వేసుకువచ్చిన వారికి ఇస్తారు. ఏడాదిలో 365 రోజుల్లో ఈ కుంభోత్సవం ఒక్క రోజు మాత్రమే అమ్మవారి మూలవిరాట్ దర్శనం భక్తులకు లభిస్తుంది. అయితే అమ్మవారు ఉగ్రరూపంలో ఉండడంతో కుంభహారతి ఇవ్వగానే భ్రమరాంబాదేవి మూలవిరాట్‌పై పసుపు, కుంకుమలను ఏకధాటిగా చల్లి ఆమె క్రోధనేత్రాల చూపును భక్తులపై ప్రసరింపజేయకుండా చేస్తారు. కుంభోత్సవం నాటి సాయంత్రం స్వామివారి ఆలయాన్ని కూడా పూర్తిగా మూసివేయడమే కాక అమ్మవారి ఉగ్రమైన చూపులు స్వామివార్లపై పడకుండా మల్లికార్జున స్వామి లింగాన్ని పెరుగు, జీలకర్ర, మిరియాలు, అల్లం మొదలైన వాటితో తయారు చేసిన పెరుగన్నంపై భక్షాలను ఉంచి పూర్తిగా కప్పి వేస్తారు.


ఎస్టీ సాధనే లక్ష్యంగా ఉద్యమాలు

- వీఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఎం సుభాష్ చంద్రబోస్


ఉద్యమ సంఘీభావం చెబుతున్న వీఆర్‌పీఎస్ నేతలు

కర్నూలు(అర్బన్): వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ సాధించడమే లక్ష్యంగా ఉద్యమాలను ఉధృతం చేయనున్నట్లు వీఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ చెప్పారు. పాదయాత్రలో ఇచ్చిన మాట మేరకు వాల్మీకి/ బోయలను ఎస్టీలుగా గుర్తిస్తూ మార్చి 24వ తేదీన అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. రాష్ట్ర అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించేంతవరకు ఢిల్లీ కేంద్రంగా పోరాటాలను కొనసాగిస్తామన్నారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో వీఆర్‌పీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ ఉద్యమ కార్యాచరణలో భాగంగా మే 31వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద వాల్మీకుల సంకల్ప దీక్షలను చేపడుతున్నామన్నారు. ఈ దీక్షలకు రాజకీయ పార్టీలకు అతీతంగా వాల్మీకులు స్వచ్ఛందంగా కలిసి రావాలన్నారు. 2007లో వీఆర్‌పీఎస్ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు వాల్మీకులను ఎస్‌టీ జాబితాలో చేర్చాలని సుదీర్ఘ పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, మాజీ జెడ్పీటీసీలు జీ రాంభీంనాయుడు, ఎల్ వెంకటేశ్వర్లు, మాలపల్లి లక్ష్మయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కప్పట్రాళ్ల మల్లికార్జున, రాష్ట్ర కార్యదర్శులు నరేంద్ర, ఖాశీం నాయుడు, రాష్ట్ర నాయకులు మురళీనాయుడు, తిరుమలేష్, రంగన్న, రఘు తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి


రాజకీయ సదస్సులో పాల్గొన్న యాదవ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): యాదవులకు అన్ని పార్టీలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని యాదవ సంఘం నేతలు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయ ఆవరణలో యాదవుల రాజకీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకులు బీ నాగేశ్వరరావు యాదవ్, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అయ్యన్నయాదవ్, టీ శేషఫణియాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీల గెలుపు ఓటములు యాదవుల ఓట్లపై ఆధార పడి ఉన్నాయన్నారు. యాదవులకు అన్ని పార్టీల్లో తీరని ద్రోహం జరుగుతున్నదన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ప్రతి జిల్లాలో రెండు ఎమ్మెల్యే టికెట్లను, రాష్ట్రంలో ఏడు ఎంపీ స్థానాలను యాదవులకు కేటాయించాలన్నారు. సమావేశంలో యాదవ నేతలు తిమ్మయ్య యాదవ్, సింధు నాగేశ్వరరావుయాదవ్, శేషుయాదవ్, రాముయాదవ్, నారాయణయాదవ్, ప్రభాకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కొలిమిగుండ్ల: ప్రార్థన చేసేందుకు బెలుంలో కొండపైకి వెళుతున్న క్రైస్తవులు,


బేతంచెర్ల: సిమెంట్ నగర్ ఏజీఎం చర్చిలో..

పునరుత్థానం.. లోకానికి సంబరం


కర్నూలు: గణేష్ నగర్‌లోని హోసన్న మందిరంలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ఏసు ప్రభువు పునరుత్థాన పండుగ ఈస్టర్‌ను ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. వేకువ జాము నుంచే రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహలతో గడిపారు. నూతన దుస్తులు ధరించి చర్చీలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఏసును కీర్తిస్తూ పాటలు పాడారు. పాపులను రక్షించడం గుడ్‌ఫ్రైడే సందేశమైతే, అంతం చేయాలన్న ప్రతిసారి సత్యమన్నది ఏదో రూపంలో జన్మిస్తూనే ఉంటుందన్నది ఈస్టర్ నేర్పిన పాఠమని మతపెద్దలు తెలిపారు.

– సాక్షినెట్‌వర్క్


వెల్దుర్తి: వీరన్నగట్టు కొండపై.. .


కర్నూలు: కోల్స్ చర్చిలో ఈస్టర్ వేడుకలు


ఏసు నామాన్ని జపిస్తున్న మహిళ

తల్లిదండ్రులు మందలిస్తారని..

డోన్ టౌన్: విలువైన సెల్‌ఫోన్ పోగొట్టుకు పోవడంతో తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. ఓబులాపురం గ్రామానికి చెందిన వడ్డే నారాయణ కుమారుడు వడ్డే దేవేంద్ర (19) ఐటీఐ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఫ్లవర్ డెకరేషన్ పనులు చేస్తుండేవాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చి తండ్రితో విలువైన సెల్ ఫోన్ కొనుగోలు చేయించుకున్నాడు. అయితే ఆదివారం సెల్‌ఫోన్ పోగొట్టుకు పోవడంతో తల్లిదండ్రులు మందలిస్తారన్న భయంతో ఇంటిలో ఎవ్వరు లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్ది సేపటికి గమనించిన కటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం డోన్‌కు తరలించగా ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి తల్లిదండ్రులతో పాటు తమ్ముడు, ముగ్గురు అక్కచెల్లెల్లు ఉన్నారు. మృతిని తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం తాపించి.. రైలు పట్టాలపై పడుకోబెట్టి

- భర్తను హత్యచేయించిన భార్య
- ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నం
- పోలీసుల దర్యాప్తులో వీడిన మిస్టరీ
- ఇద్దరు నిందితుల అరెస్ట్


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసులు

మంత్రాలయం రూరల్: ఎవరికీ అనుమానం రాకుండా మద్యం తాపించి.. రైలు పట్టాలపై పడుకోబెట్టి భర్తను ఓ భార్య హత్య చేయించింది. పోలీసుల దర్యాప్తులో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో అరెస్ట్ చేశారు. ఆ వివరాలను ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీనివాసులు వెల్లడించారు. మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన ఉప్పర నారాయణకు దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామానికి చెందిన ఉప్పర వరలక్ష్మితో 2008లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. ఉప్పర నారాయణ మద్యానికి బానిసకావడంతో పాటు మరో మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నారు. దీంతో విసుగు చెందిన ఉప్పర వరలక్ష్మి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు మందలించి.. పుట్టినిల్లు అయిన తెర్నేకల్‌కు పంపించారు. సి.బెళగల్ మండలం మారందొడ్డిలో ఉన్న సమీప బంధువు చిన్న గోవిందుకు (ఈయనకు భార్య, పిల్లలు ఉన్నారు) ఉప్పర వరలక్ష్మి ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పి బాధను వ్యక్తం చేసింది. గోవిందుతో వివాహేతర సంబంధం ఏర్పాటు చేసుకుని భర్త ఉప్పర నారాయణను అంతం చేయాలని పథకం రచించింది. 2022 మే నెల 27వ తేదీన చిన్న గోవిందుతో ఉప్పర నారాయణకు ఫోన్ చేసి మాధవరం నుంచి ఎమ్మిగనూరుకు రావాలని కోరగా వెంటనే బయలుదేరి వెళ్లాడు. అక్కడి నుంచి బెళగల్‌కు, అనంతరం కర్నూలుకు వెళ్లారు. ఉప్పర నారాయణకు ఫుల్‌గా మద్యం తాపించి రాత్రి 10 గంటల సమయంలో కర్నూలు రైల్వే స్టేషన్ వద్దకు వచ్చారు. కొంత దూరం నడుచుకుంటూ వెళ్లి..మద్యం మత్తులో ఉన్న ఉప్పర నారాయణను రైల్వే ట్రాక్‌పైనే పడుకోబెట్టారు. హైదరాబాద్ నుంచి కర్నూలు వస్తున్న రైలు చిన్న నారాయణ పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. అక్కడి నుంచి ఇంటికి చేరుకున్న చిన్న గోవిందు.. ఉప్పర నారాయణ సెల్‌ఫోన్‌లోని సిమ్ కార్డును మరో సెల్‌లో మార్చి ఆడవారి వాయిస్ వచ్చేలాగా సెట్టింగ్ చేసుకుని ఆ నంబర్ వచ్చే కాల్స్ స్వీకరించే వారు. 2022 మే 30వ తేదీన తన భర్త ఉప్పర నారాయణ కన్పించడం లేదని భార్య ఉప్పర వరలక్ష్మి మాధవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. మంత్రాలయం సీఐ శ్రీనివాసులుకు అనుమానం వచ్చి కాల్ డేటా ఆధారంగా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. నిందితులైన చిన్న గోవిందు, ఉప్పర వరలక్ష్మిని అదుపులోకి తీసుకుని విచారించగా జరిగిన నేరాన్ని అంగీకరించారు. హత్యకు వినియోగించిన ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. కేసు దర్యాప్తులో పూర్తి స్థాయిలో సహకారం అందించిన మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు వేణుగోపాల్‌రాజు, కిరణ్ సిబ్బందిని జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్, ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ అభినందించారని సీఐ తెలిపారు. నిందితులను ఎమ్మిగనూరు కోర్టు జడ్జి ముందు హాజరు పర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ చెప్పారు.


ఉప్పర నారాయణ (ఫైల్)